సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం, 4, మార్చి, 2024



కొండెక్కిన కోడి ధరలు

చికెన్ ధరలు పెరగడంతో అమ్మకాలు అమాంతం పడిపోయాయి. ప్రస్తుతం కిలో చికెన్ రూ.300 పలుకుతోంది. 8లో



పల్స్ పోలియో సక్సెస్

జిల్లావ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. 9లో

గరిష్టం / కనిష్టం
36° / 21°

వాతావరణం

జిల్లాలో సోమవారం మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రత నమోదవుతుంది. రాత్రి వేళ వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి విశేష పూజలు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం కిటకిటలాడగా, భక్తులు క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నప్రాసనలు, ఒడి బియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఈఓ ఎస్.రజనీకుమారి, ఆలయ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో ఇంటెలిజెన్స్ డీఎస్పీ



అమ్మవారి సన్నిధిలో ఇంటెలిజెన్స్ డీఎస్పీ వెంకన్నబాబు

పెద్దమ్మతల్లి అమ్మవారిని ఆదివారం కొత్తగూడెం ఇంటెలిజెన్స్ డీఎస్పీ వెంకన్నబాబు సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆయన అమ్మవారి శేష వస్త్రప్రసాదాలను అందజేశారు. డీఎస్పీ వెంట పాల్వంచ పట్టణ ఎస్‌ఐ బాణాల రాము ఉన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ధరణి దరఖాస్తుల ప్రత్యేక డ్రైవ్ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు ధరణి సమస్యల పరిష్కారంలో నిమగ్నమయ్యారని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల ఈవిషయాన్ని గమనించాలని సూచించారు.

పాల్వంచ డీఎస్పీ వెంకటేష్ బదిలీ



బదిలీపై వెళ్తున్న డీఎస్పీ వెంకటేష్

పాల్వంచ: పాల్వంచ డీఎస్పీ వెంకటేష్‌ను బదిలీ చేస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ సిటీలోని సీసీఎస్అండ్ డీడీ విభాగంలో పనిచేస్తున్న ఏసీపీ ఆర్.సతీశ్‌కుమార్ పాల్వంచ డీఎస్పీగా నియమితులయ్యారు. వెంకటేష్‌ను హైదరాబాద్ డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గత ఫిబ్రవరి 12నే వెంకటేష్ బదిలీ కాగా ఆయన స్థానంలో 14న ఆదినారాయణ బాధ్యతలు చేపట్టారు. అదే రోజు డీఎస్పీ బదిలీ ఉత్తర్వులు రద్దు కావడంతో తిరిగి వెంకటేష్ డీఎస్పీగా కొనసాగుతున్నారు. కాగా పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఐదేళ్ల కాలంగా సత్తుపల్లి, పాల్వంచ డివిజన్‌లలో డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తుండటంతో వెంకటేష్‌కు ఇప్పుడు బదిలీ అనివార్యంగా మారినట్లు తెలుస్తోంది.

శ్రీనివాసాచారికి 'దుబాయి' ఆహ్వానం



డాక్టర్ శ్రీనివాసాచారి

అశ్వాపురం: వాస్తు రంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు అవార్డులు, అమెరికా ఆస్ట్రాలజీ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన అశ్వాపురం మండలం మొండికుంట గ్రామానికి చెందిన వాస్తు సిద్ధాంతి డాక్టర్ పదిరావూరి శ్రీనివాసాచారికి దుబాయిలో జరిగే ఆర్బ్యాంట్రిలైజేషన్ అవార్డుల ప్రదానోత్సవానికి విశిష్ట అతిథిగా ప్రత్యేక ఆహ్వానం అందింది. ఈ నెల 23 నుంచి 26 వరకు దుబాయిలో వేడుక జరగనుంది. శ్రీనివాసాచారి సింగపూర్ నుంచి ఆస్ట్రోలాజికల్ ఎక్స్‌లెన్స్ అవార్డు, అమెరికన్ క్లబ్ లైఫ్‌టైమ్ మెంబర్‌షిప్, ఇండో థాయ్‌ల్యాండ్ వాస్తు బృహస్పతి అవార్డు, శ్రీ బుద్ధ మహర్షి అవార్డు, థాయ్‌ల్యాండ్ నుంచి మహర్షి ఆగస్త్య అవార్డు, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా వాస్తు సామ్రాట్ అవార్డు, ఏపీ ప్రభుత్వం నుంచి దైవజ్ఞరత్న అవార్డు, తిరుపతి నుంచి జ్యోతిష్య జ్ఞానరత్న తదితర అవార్డులు పొందారు. ఈ నేపథ్యంలో దుబాయిలో జరిగే కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ఆయనకు అవకాశం దక్కింది.

సొంతింటి దిశగా..

ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సర్కారు శ్రీకారం

- దరఖాస్తుదారుల్లో వ్యక్తమవుతున్న హర్షాతిరేకాలు
- ఉమ్మడి జిల్లాలో 35 వేల ఇళ్లు వచ్చే అవకాశం



చుంచుపల్లి: ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో మరో గ్యారంటీ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నెల 11న ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో అర్హులలో ఆశలు రేకెత్తుతున్నాయి. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఆర్థికసాయం చేయడంతోపాటు స్థలంలేని వారికి జాగా కూడా ఇవ్వనుంది. నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మంజూరు చేయనుండగా, ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాలకు 35 వేల ఇళ్లు వచ్చే అవకాశం ఉంది.

వైఎస్ హయాంలో విజయవంతంగా అమలు..

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 2006లో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం అమల్లోకి తెచ్చి నిరుపేదలకు పక్కా ఇళ్ల నిర్మించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4.10 లక్షల ఇళ్లను మంజూరు చేయగా దాదాపు 3 లక్షల ఇళ్లను పూర్తి చేశారు. ఇక 2014లో స్వరాష్ట్రం ఏర్పడ్డాక బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇందిరమ్మ పథకంలో స్థానంలో 2015లోడబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకాన్ని తెచ్చింది. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5.40 లక్షలు ఇవ్వాలని నిర్ణయించింది. ఉమ్మడి జిల్లాకు 15,399 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేసింది. ఇందులో భద్రాద్రి జిల్లాకు 6,443 ఇళ్లు, ఖమ్మం జిల్లాకు 8,956 ఇళ్లు ఇచ్చింది. అయితే ఇళ్ల నిర్మాణం అన్ని చోట్ల నత్తనడకనే సాగింది. ఇక 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు ఇళ్లు లేని నిరుపేదలు సొంత జాగాను కలిగి ఉంటే రూ.3 లక్షల వరకు సాయం అందిస్తామని గృహలక్ష్మి పథకం తెచ్చింది. ఉమ్మడి జిల్లాలో భారీగా దరఖాస్తులు స్వీకరించి, విచారణ చేసి కొందరు లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ సైతం అందజేశారు.

అప్పటి సిబ్బందిలో ఆశలు..

బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2014లో హౌసింగ్ శాఖను పూర్తిగా రద్దు చేసి, అధికారులు, ఉద్యోగులను ఆర్‌ఎండీ శాఖలో విలీనం చేసింది. మరికొందరిని ఇతర శాఖలకు పంపింది. గతంలో అన్ని మండలాల్లో గృహ నిర్మాణ శాఖ పరిధిలో ఏఈల కార్యాలయాలు ఉండగా, నియోజకవర్గానికి ఒకరు చొప్పు న డీఈలు, రెవెన్యూ డివిజన్లకు ఒక్కొక్కరు చొప్పున ఈఈలు, జిల్లా స్థాయిలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఒకరు ఉండేవారు. ప్రధాన పట్టణాల్లో పట్టణ ఏఈలు, డీఈలు సైతం ఉండేవారు. ఇక మండలానికి నలుగురు, ఐదుగురు చొప్పున వర్క్ ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు ఉండేవారు. ప్రస్తుత ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం పునరుద్ధరిస్తుండటంతో గతంలో పనిచేసి సిబ్బందిలో కూడా ఆశలు చిగురిస్తున్నాయి. తమకు అనుభవం ఉన్నందున పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయగలమనే భావనలో వారిలో వ్యక్తమవుతోంది.

6,49,271 దరఖాస్తులు

కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో విజయవంతంగా అమలు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తిరిగి పునరుద్ధరించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో గత జనవరిలో ప్రజాపాలన గ్రామసభల్లో అర్హుల నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8,21,541 ప్రజాపాలన దరఖాస్తులు రాగా, వాటిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 6,49,271 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఖమ్మం జిల్లాలో 3,69,633, భద్రాద్రి జిల్లాలో 2,79,638 మంది దరఖాస్తు చేసుకున్నారు. కాగా ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గృహ నిర్మాణ శాఖకు ఇందిరమ్మ పథకం అమలు బాధ్యతను అప్పగించింది.

ఆర్థికసాయం వస్తుందని..



ప్రభుత్వం జనవరిలో చేపట్టిన ప్రజాపాలన ద్వారా ఇందిరమ్మ ఇంటి పథకం కోసం దరఖాస్తు చేసుకున్నాను. నాకు సొంత జాగా ఉంది. ప్రభుత్వం రూ.5 లక్షల సాయం ఆర్థికసాయం చేస్తే ఇల్లు నిర్మించుకుంటాను. ఇందిరమ్మ ఇంటి పథకం వర్తిస్తుందని ఆశిస్తున్నాను. ఈ పథకం నిరుపేదలకు ఎంతో ఉపయోగం.

–పట్నం సుగుణ, బాబుక్యాంపు, చుంచుపల్లి

అంగ వైకల్యాన్ని ఎదుర్కొనే ఆయుధం..

పల్స్ పోలియో కార్యక్రమంలో కలెక్టర్ ప్రియాంక ఆల



డీఎంహెచ్‌ఓతో కలిసి తన కూతురికి పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ ప్రియాంక

పాల్వంచ: అంగవైకల్యాన్ని ఎదుర్కొనే ఆయుధం పల్స్ పోలియో కార్యక్రమమని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. ఆదివారం పట్టణంలోని శేఖరం బంజర పీహెచ్‌సీలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ తన కూతురు, కుమారుడితోపాటు పలువురు చిన్నారులకు చుక్కల మందు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు. జిల్లాలో 925 కేంద్రాలు, 38 మొబైల్ టీంలు, 33 ట్రాన్సిట్ పాయింట్‌ల ద్వారా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 427 మంది వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది , 1,933 మంది అంగన్‌వాడీ సిబ్బంది , 1440 మంది ఆశా కార్యకర్తలు, ఇతరులు 91, మొత్తం 3,991 మంది ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని వివరించారు. మారుమూల గ్రామం కొండవాయిలో వ్యాక్సిన్ వేసేందుకు మోటార్ బైక్ టీం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రానున్న రెండురోజులపాటు ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు ఇంటింటి సర్వే నిర్వహించి, ప్రతీ చిన్నారికి పోలియో చుక్కలు వేయిస్తారని అన్నారు. ఈ కార్యక్రమాన్ని వందశాతం పూర్తి చేయాలన్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ జేవీఎల్ శిరీష, అధికారులు బాలాజీ నాయక్, కృష్ణకుమారి, నాగభూషణం, తహసీల్దార్ వివేక్, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో 96 శాతం పూర్తి..

కొత్తగూడెంరూరల్: జిల్లాలోని ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శిరీష తెలిపారు. ఈ మేరకు ఆమె వివరాలు వెల్లడించారు. ఐదేళ్లలోపు చిన్నారుల్లో 96 శాతం పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు పేర్కొన్నారు. తొలిరోజు పల్స్ పోలియో కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన లభించిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 98,358 పిల్లలను గుర్తించగా, 94,270 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశామన్నారు. సోమ, మంగళ వారాల్లో ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి మిగతా పిల్లలకు చుక్కల మందు వేయాలన్నారు.

శ్రీరామగిరిలో భద్రాద్రి రామయ్య కల్యాణం

భద్రాచలంటౌన్: ఏపీలోని వీఆర్ పురం మండలం శ్రీరామగిరి గ్రామంలో ఆదివారం భద్రగిరి రామయ్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. శ్రీ సుందర సీతారామచంద్ర స్వామివారి ఆలయ సన్నిధిలో ధర్మ ప్రచారంలో భాగంగా ఈ వేడుక జరి పారు. కల్యాణ మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి కల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. భద్రాచలం ఆలయ ఈఓ రమాదేవి పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ ప్రారంభం

భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామివారి ఆలయంలో భక్తులకు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఆలయ ఈఓ రమాదేవి ఆదివారం ప్రారంభించారు. ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

రామయ్య నిత్యాన్నదానానికి విరాళం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్న దాన కార్యక్రమానికి ఆదివారం హైదరాబాద్, ఖమ్మం జిల్లాలకు చెందిన భక్తులు విరాళం అందజేశారు. హైదరాబాద్ మణికొండకు చెందిన గోపీనాథ్ దంపతులు రూ. లక్ష, ఖమ్మం జిల్లా మధిరకు చెందిన దుర్గాప్రసాద్–అరుణ దంపతులు రూ.లక్ష చెక్కులను ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు. ఆలయ సిబ్బంది సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

రామయ్య సేవలో ఎస్పీ..



రామాలయంలో కుటుంబ సభ్యులతో ఎస్పీ రోహిత్‌రాజ్

భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారిని ఎస్పీ రోహిత్ రాజ్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు ఎస్పీకి స్వామివారి ప్రసాదం తోపాటు జ్ఞాపికను అందజేశారు.

విద్యార్థినుల్లో భయం పోగొట్టాలి

- పదో తరగతి పరీక్షలు సక్రమంగా రాసేలా చూడాలి
- ఎగ్జామ్స్ ప్రత్యేకాధికారి, ట్రైకార్ జీఎం శంకర్‌రావు



విద్యార్థినులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి కుంజా శంకర్‌రావు

దుమ్ముగూడెం : కొందరు పిల్లలు పరీక్షలు అంటే భయపడతారని, విద్యార్థుల్లో ఆ భయాన్ని పోగొట్టాలని, పరీక్షలు ధైర్యంగా రాసేలా అవగాహన కల్పించాలని పదో తరగతి పరీక్షల ప్రత్యేకాధికారి, ట్రైకార్ జీఎం శంకర్‌రావు సూచించారు. ఆదివారం మండలంలోని రేగుబల్లి–1 గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినుల హాజరు, జీసీసీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. విద్యార్థినులు రాస్తున్న ప్రీ ఫైనల్ పరీక్షల తీరును పరిశీలించారు. బాలికలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ భయాందోళనలు లేకుండా మనసు ప్రశాంతంగా ఉంచుకోవాలని విద్యార్థినులకు సూచించారు. ఉపాధ్యాయులను అడిగి సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. పిల్లలు అస్వస్థతకు గురైతే తక్షణమే ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించాలని ఉపాధ్యాయులకు చెప్పారు. పాఠశాలలో స్వచ్ఛమైన తాగునీరు, సమయానుకూలంగా మెనూ ప్రకారం భోజనం, స్నాక్స్, రాత్రి స్టడీ అవర్‌లో టీ కాఫీలు అందించాలని చెప్పారు. విద్యార్థినుల పట్ల హెచ్‌ఎం, వార్డెన్, సబ్జెక్ట్ టీచర్లు, ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో కరెంట్ పోకుండా చూడాలన్నారు. విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత సాధించేలా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, వార్డెన్లతోపాటు ఏటీడీవోలు, స్పెషల్ ఆఫీసర్లు బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏటీడీఓ నరసింహారావు, హెచ్‌ఎం నాగమణి, వార్డెన్ జానకి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సుకు గుండాల ఎంపీపీ



ఎంపీపీ ముక్తి సత్యం

గుండాల: ఈ నెల 4,5 తేదీల్లో జార్ఖండ్ రాజధాని రాంచీలో జరిగే పీసా చట్టం జాతీయస్థాయి అవగాహన సదస్సుకు జిల్లా నుంచి గుండాల ఎంపీపీ ముక్తి సత్యం ఎంపికయ్యాడు. పీసా చట్టం అమలు చేయాల్సిన ఐదు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్ గడ్, జార్ఖండ్, ఒడిశాలలో చట్టం అమలు తీరు, పరిణామాలపై ఈ సదస్సులో చర్చిస్తారు. ఈ సందర్భంగా ఎంపీపీ సత్యం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పీసా చట్టానికి సంబంధం లేకుండా నూతన అటవీ సంరక్షణ నియమాలను తెచ్చారని, దీనివల్ల పీసా చట్టం నిర్వీర్యమవుతోందని పేర్కొన్నారు. ఈ చట్టం పకడ్బందీగా అమలు కావాలంటే నూతన అటవీ సంరక్షణ నియమాలు–2022ను రద్దు చేయాలని కోరారు. పీసా చట్టం ఆదివాసీల హక్కులను కాపాడేదిగా ఉంటే, నూతన అటవీ సంరక్షణ నియమాల వల్ల ఆదివాసీలకు మూలాధారమైన అటవీ సంపద దెబ్బతినేలా ఉందని పేర్కొన్నారు. ఏ చట్టమైనా కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టేలా ఉండొద్దన్నారు. ఇవే విషయాలను రాంచీలో రెండు రోజులపాటు జరిగే సదస్సులో చర్చిస్తామని అన్నారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి



కిన్నెరసానిలో జలవిహారం చేస్తున్న న్యాయమూర్తి సాయిశ్రీ

పాల్వంచరూరల్ : కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. 466 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.15,480 ఆదాయం, 200 మంది బోటు షికారు చేయగా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.7,760 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

కిన్నెరసానిని సందర్శించిన న్యాయమూర్తి

కిన్నెరసాని పర్యాటక ప్రాంతాన్ని కొత్తగూడెం కోర్టు న్యాయమూర్తి కె.సాయిశ్రీ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించి జలాశయంలో బోటు షికారు చేశారు.

సీఎంను కలిసిన భద్రాచలం ఎమ్మెల్యే

- కాంగ్రెస్‌లో చేరికపై ఊహాగానాలు..?
- అభివృద్ధి నిధుల కోసమే కలిశాను: ఎమ్మెల్యే



కుటుంబ సభ్యులతో సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే వెంకట్రావు, పక్కన మంత్రి పొంగులేటి

భద్రాచలం: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆదివారం హైదరాబాద్‌లో కలిశారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తన భార్య, కూతురితో కలిసి సీఎంను కలవటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్ నుంచి వెంకట్రావు ఒక్కరే ఎమ్మెల్యేగా గెలిచారు. కాగా వెంకట్రావు కాంగ్రెస్‌లో చేరుతారంటూ కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతోంది. ఈ నెల 11న సీఎం రేవంత్ రెడ్డి భద్రాచలం వచ్చే అవకాశం ఉందని, ఆ రోజే అధికార పార్టీలో చేరతారనే ప్రచారం కూడా ఉంది. గతంలో వైఎస్సార్ సీపీలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడిగా ముద్ర ఉన్న ఆయన.. పొంగులేటితో కలిసి సీఎం వద్దకు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఆయను కాంగ్రెస్‌లో చేరడం లాంఛనమేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. కాగా ఎమ్మెల్యే వెంకట్రావును సంప్రదించగా.. నియోజకవర్గ అభివృద్ధి నిధుల కోసమే జిల్లా మంత్రి సమక్షంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిశానని పేర్కొన్నారు. నియోజకవర్గ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కాంగ్రెస్‌లో చేరతాననే ప్రచారం నిజం కాదని వెల్లడించారు.

ఇక 'మాస్‌లైన్'తో ఉద్యమం

- చారిత్రక తప్పిదాలను సవరించుకునేందుకే విప్లవ పార్టీల విలీనం
- 'ఎంఎల్' నేతలు ప్రదీప్‌సింగ్, పోటు రంగారావు, సుభాష్ దేవ్
- ఖమ్మంలో భారీ ప్రదర్శన, బహిరంగ సభ



అభివాదం చేస్తున్న మాస్‌లైన్ నాయకులు



ఖమ్మం నగరంలో కదం తొక్కుతున్న ఎర్రదండు

ఖమ్మంమయూరిసెంటర్ : పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఇక నుంచి ఐక్యంగా పోరాడుతామని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నేతలు ప్రకటించారు. మోదీ పాలనలో రాజ్యాంగ సంస్థలు విధ్వంసానికి గురయ్యాయని, ఆయన పాలన నియంతలను తలపిస్తోందని విమర్శించారు. ఆర్థికంగా, రాజకీయంగా, ప్రజాస్వామికంగా వ్యవస్థలను ఇబ్బంది పెడుతూ బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, పీసీసీ సీపీఐ(ఎంఎల్), సీపీఐ(ఎంఎల్) ఆర్‌ఐ పార్టీలు రాజకీయ సైద్ధాంతిక చర్చల తర్వాత సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పేరుతో ఒకే వేదిక మీదకు వచ్చాయని పేర్కొన్నారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ యూనిటీ మహాసభ సందర్భంగా ఆదివారం ఖమ్మంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పెవిలియన్ గ్రౌండ్‌లో కెచ్చల రంగయ్య అధ్యక్షతన జరిగిన సభలో మాస్‌లైన్ నేత ప్రదీప్ సింగ్ ఠాగూర్ మాట్లాడుతూ.. గతంలో జరిగిన తప్పిదాన్ని విప్లవ పార్టీలు గుర్తించాయని, దాన్ని సరిచేసి బలమైన విప్లవోద్యమ నిర్మాణానికి మాస్‌లైన్‌గా అవతరించాయని తెలిపారు. ఇకపై రాజకీయ, సైద్ధాంతిక అవగాహనతో ముందుకు సాగుతామన్నారు. విప్లవ పార్టీల ఐక్యత మహాసభ జరుగుతున్న ఖమ్మం అనేక ప్రజా ఉద్యమాలకు వేదికగా నిలిచిందని ఠాగూర్ తెలిపారు.

అతిపెద్ద పార్టీగా అవతరించేందుకే..

మొదటిసారి విప్లవ పార్టీలు కలిసి అతిపెద్ద కమ్యూనిస్టు పార్టీగా అవతరించాలనే లక్ష్యంతోనే మాస్‌లైన్ పేరుతో విలీనం అయ్యామని, ఇది ఒక చరిత్రాత్మక రోజని ఠాగూర్ పేర్కొన్నారు. ఇండియా కూటమి బీజేపీకి రాజకీయ ప్రత్యామ్నాయమే తప్ప మరొకటి కాదని అన్నారు. కమ్యూనిస్టులు అధికారంలో ఉంటే సరళీకరణ విధానాలను అమలు చేస్తున్నారని, విపక్షంలో ఉంటే వ్యతిరేకిస్తున్నారని అన్నారు. మరో నేత పోటు రంగారావు మాట్లాడుతూ.. నరహంతక మోదీ పాలనలో దేశంలో ఒక భయానక పరిస్థితి నెలకొందన్నారు. మోదీ హిట్లర్‌కు వారసుడని ఆరోపించారు. సోషల్ మీడియా విష ప్రచారంతో ప్రజలను తప్పుదారి పట్టిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో కేసీఆర్ పాలన నిజాంను తలపించిందని, ఆయన సచివాలయాన్ని చూడలేదని, ప్రగతిభవన్‌కు ఎవరినీ రానివ్వలేదని విమర్శించారు. ఆ పాపాలే కాంగ్రెస్‌ను గెలిపించాయని చెప్పారు. కాగా కళాకారులు ఆటపాటలతో అలరించారు. సభలో పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులు సంజయ్ సింఘ్వీ, దినేష్ గుహాయ్, కేజీ రామచందర్, కె.రమ, ఆర్.చంద్రశేఖర్, గుమ్మడి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఆలపాటి రామ్మోహనరావు

దమ్మపేట : రాష్ట్ర రైతుల ప్రయోజనం కోసం కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామ్మోహనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని శ్రీరాంపురంలో ఆదివారం నిర్వహించిన కొబ్బరి రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కొబ్బరి పంట ఎక్కువగా సాగు చేస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కొబ్బరి సాగు ఎక్కువగా ఉన్న గ్రామ రైతులతో సొసైటీలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కొబ్బరి బోర్డు ఏర్పాటు ద్వారా సబ్సిడీపై మొక్కలు, డ్రిప్, తదితర ప్రోత్సాహకాలు అందే అవకాశం ఉంటుందని చెప్పారు. కొబ్బరి సంబంధిత ఉత్పత్తుల పరిశ్రమలు కూడా రాష్ట్రంలో నెలకొల్పే అవకాశం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య, యంగ్రాతి అప్పారావు, దొడ్డా ప్రసాద్, దొడ్డా లక్ష్మీనారాయణ, మోరంపూడి కేశవరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి



మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల

పాల్వంచరూరల్: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండల పరిధిలోని నారాయణరావుపేట గ్రామంలో ప్రీమియర్ లీగ్ టీపీఎస్ మెమోరియల్‌కప్ మండలస్థాయి క్రికెట్ పోటీలను ఆదివారం ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడల వల్ల దేహదారుఢ్యం, స్నేహభావం పెంపొందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యర్రపోతు సంతోశ్‌కుమార్, అఖిల్, కె.వంశీ, నాయకులు కొండం వెంకన్న, కోమటిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, గండు భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పీఎఫ్ అడిషనల్ కమాండెంట్ బదిలీ



జంగయ్య

పాల్వంచ: జిల్లాలోని కేటీపీఎస్, బీటీపీఎస్ కర్మాగారాలకు చెందిన స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అడిషనల్ కమాండెంట్ సి.జంగయ్య బదిలీ అయ్యారు. ఈమేరకు శనివారం హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి బదిలీ అవుతున్నట్లు ఉత్తర్వులు అందాయి. జంగయ్య 2021 డిసెంబర్‌లో ఇక్కడ అసిస్టెంట్ కమాండెంట్‌గా విధుల్లో చేరగా.. ఇటీవల అడిషనల్ కమాండెంట్‌గా పదోన్నతి లభించింది. కాగా, ఇక్కడ ప్రస్తుతం అసిస్టెంట్ కమాండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ.అప్పాజీ పూర్తిస్థాయి పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించనున్నారు.

కిన్నెరసాని క్రీడా పాఠశాలలో ఎంపికలు

పాల్వంచరూరల్: మండల పరిధి కిన్నెరసాని క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఈ నెల 5, 6వ తేదీన విద్యార్థులకు బ్యాటరీ టెస్ట్ ద్వారా ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ క్రీడాల అధికారి గోపాల్‌రావు ఆదివారం తెలిపారు. ఐటీడీఏ పీఓ, డిప్యూటీ డైరెక్టర్ ఆదేశాల మేరకు మంగళ, బుధవారాల్లో కిన్నెరసాని క్రీడా పాఠశాలలో 40 మంది బాలురు, కాచనపల్లి బాలికల క్రీడా పాఠశాలలో 40 మంది విద్యార్థినులు, వాటర్ స్పోర్ట్స్ అకాడమీ బోయినపల్లి హైదరాబాద్‌కు 20 మంది బాలికలు, 20 మంది బాలురను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆగస్టు 31, 2024 నాటికి 9 నుంచి 11ఏళ్ల వయసు కలిగిన నాలుగో తరగతి విద్యార్థులు మాత్రమే అర్హులని, ఎంపికకు వచ్చేటప్పుడు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, పాస్ ఫొటోను వెంట తెచ్చుకోవాలని సూచించారు.

ఆకట్టుకున్న 'నిర్విరామ నృత్య నీరాజనం'



అవార్డు పొందిన కళాకారులతో నిర్వాహకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం అహోబిల మఠ ప్రాంగణంలోని శ్రీ నృసింహ సేవా వాహిని ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన నిర్వహించిన 12 గంటల నిర్విరామ నృత్య నీరాజనం కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. అంతేకాక తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌తో పాటు తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. ఆదివారం ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు నిర్విరామంగా సాగిన నృత్యాల ప్రదర్శనలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శనలు ప్రదర్శించి అవార్డులు సొంతం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ యూనియన్ మెంబర్ అశోక్, అనుమాండ్ల నాగరాజు, వనపర్తి పద్మావతి, పోకల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


నాలుగు పిల్లలు జననం



జన్మించిన మేక పిల్లలు

టేకులపల్లి: ఒకే కాన్పులో నాలుగు మేక పిల్లలు జన్మించిన సంఘటన టేకులపల్లి మండలం చింతోనిచెలక గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామంలోని గంగినేని రామచంద్రయ్యకు చెందిన ఓ మేక ఒకే కాన్పులో నాలుగు పిల్లలకు జన్మనిచ్చింది. కాగా, ఈ మేక పిల్లలను చూడడానికి చుట్టుపక్కల వారు వచ్చి చూసి వెళ్తుండడం విశేషం.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,045

కొండెక్కిన కోడి ధరలు

- కేజీ చికెన్ రూ.260 నుంచి రూ.300
- నాటుకోడి కేజీ రూ. 500 పైమాటే..
- పెరిగిన ధరలతో ప్రజలు బెంబేలు
- మేడారం జాతరకు తరలించడంతో తగ్గిన దిగుమతి





పౌల్ట్రీ ఫామ్‌లో కోళ్లు, (ఇన్‌సెట్) చికెన్ కట్ చేస్తున్న వ్యాపారి

పాల్వంచరూరల్: కోడి(చికెన్) ధరలు కొండెక్కాయి. దీంతో చికెన్ అమ్మకాలు అమాంతం పడిపోయాయి. మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర కారణంగా బాయిలర్ కోళ్లన్నీ జాతరకు తరలించడంతో అందుబాటులో లేక ధరలు ఒక్కసారిగా పెరిగినట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా రెండు, మూడు రోజుల క్రితం కేజీ చికెన్ ధర రూ.200 నుంచి రూ.250లోపు ఉండగా.. ఒకేసారి రూ.260 నుంచి రూ.300కు చేరడం గమనార్హం. పెరిగిన ధరలతో కొనుగోళ్లు పడిపోగా.. చికెన్ షాపులు వెలవెలబోతున్నాయి.

పైపైకి ధర..

జిల్లా వ్యాప్తంగా 1,700 పౌల్ట్రీకోళ్ల ఫామ్‌లు ఉన్నాయి. వీటిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఐదు వేల మంది ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇందులో కొందరు స్వయం ఉపాధి కోసం బ్యాంక్‌ల ద్వారా రుణాలు పొంది కోళ్ల ఫామ్‌లు పెట్టుకున్నారు. కాగా, స్కిన్‌తో కేజీ చికెన్ ధర రూ. 290 ఉంటే స్కిన్‌లెస్ రూ.300 చొప్పున విక్రయాలు సాగుతున్నాయి. అయితే, నాటుకోడి చికెన్ ధర గతంలో మాదిరిగానే రూ. 500 నుంచి రూ.700 చొప్పున లభిస్తున్నాయి.

మేడారం జాతర ఎఫెక్ట్..

మేడారం జాతరకు లక్షల్లో కోళ్లు తరలించారు. దీంతో ఫామ్‌ల్లో కోళ్లు లేకుండా పోయాయి. ఫలితంగా చికెన్ వ్యాపారులు ఏపీ రాష్ట్రంతో పాటు హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి కోళ్లను దిగుమతి చేసుకుంటుండగా.. రవాణా భారం పెరగడంతో చికెన్ ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.

పడిపోయిన వ్యాపారం..

జిల్లాలో ప్రతీ ఆదివారం 200 నుంచి 250 టన్నుల కుపైగా చికెన్ విక్రయాలు జరుగుతాయని అంచనా. అయితే, ధరలు సాధారణంగా ఉంటే అమ్మకాలు జోరుగా సాగేవి కానీ ధరలు పెరగడంతో 100 టన్నులకు మించి అమ్మకాలు సాగడం లేదని సమాచారం.

కోళ్లన్నీ మేడారం తీసుకెళ్లడంతోనే..



మేడారం జాతరకు కోళ్లన్నీ తరలించారు. మళ్లీ ఇక్కడి ఫామ్‌ల్లో కోళ్లు పెరగాలంటే రెండు నుంచి మూడు నెలల సమయం పడుతుంది. అప్పటి వరకు కోళ్లను దూర ప్రాంతాల నుంచి దిగుమతి తీసుకోవాల్సి ఉంటుంది. తద్వారా ధర పెంచక తప్పడం లేదు. – అంగోతు నరేశ్, చికెన్ వ్యాపారి

ఇంతలా ఎప్పుడూ చూడలేదు..



చికెన్ ధరలు ఒకేసారి ఇంతలా పెరగడం ఎప్పుడూ చూడలేదు. రెండు, మూడు రోజుల ముందు కేజీ చికెన్ రూ.160కే అమ్మారు కానీ ఇప్పుడు రూ. 300 అంటున్నారు. ఈ ధరలతో చికెన్ కొనాలంటే భయమేస్తుంది. చికెన్ కూడా సామాన్య ప్రజలకు దూరమైనట్లే. – నూనావత్ వరప్రసాద్, పాల్వంచ

కొనే పరిస్థితి లేదు..



చికెన్ ధరలు ఒక్కసారిగా పెరిగాయి. చుట్టాలు వచ్చినప్పుడు, పండగలకే కాక ఆదివారం చికెన్ తెచ్చుకునేవాళ్లం. కానీ ధర రూ.280 నుంచి రూ.300 వరకు చేరడంతో చికెన్ కొనే పరిస్థితి లేదు. ఇక నాటుకోళ్ల సంగతి మరిచిపోవాల్సిందే. – భరత్, పాల్వంచ

దరఖాస్తుల ఆహ్వానం

అశ్వాపురం: మండలంలోని మిట్టగూడెం గ్రామంలో ఉన్న గిరిజన సంక్షేమ బాలుర డిగ్రీ కళాశాల ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ స్వప్నకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల డిగ్రీ సెట్ కామన్ ఎంట్రన్స్ పరీక్షకు ఏప్రిల్ 12వ తేదీ వరకు వరకు దరఖాస్తు గడువు ఉందని పేర్కొన్నారు. ప్రతిభ ఆధారంగా 2024–25 విద్యా సంవత్సరానికి ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లు కల్పిస్తామని, ఏప్రిల్ 28న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని వివరించారు. ఇతర వివరాలకు టీఎస్‌ఆర్‌డీసీసీఈటీ.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

భర్త మృతిపై భార్య ఫిర్యాదు

కరకగూడెం : అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఓ వ్యక్తి భార్య తన భర్త మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై ఎ.రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సమత్ భట్టుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కుర్నవల్లి గ్రామానికి చెందిన పోలేబోయిన సత్యనారాయణ(40) శనివారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. దీంతో ఆదివారం అతడి భార్య రమాదేవి స్థానిక పోలీస్ స్టేషన్‌లో తన భర్త మృతిపై తనకు అనుమానాలు ఉన్నాయని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సామాన్యుడిలా వెళ్లి 'బెల్ట్' తీసి..



తనిఖీ చేస్తున్న తహసీల్దార్ నాగప్రసాద్

కరకగూడెం: ఇటీవల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన నాగప్రసాద్‌మండలంలో విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. ఈనేపథ్యాన ఆదివారం రాత్రి 10 గంటల సమయాన మండలంలోని భట్టుపల్లి గ్రామంలో కేజీబీవీ పాఠశాల సమీపాన నిర్వహిస్తున్న ఓ బెల్ట్ షాపుకి సాధారణ దుస్తుల్లో వెళ్లి తనిఖీలు చేపట్టారు. దీంతో మందు సీసాలపై అధిక ధరలు వసూలు చేయడంపై మండిపడ్డారు. అంతేకాక పాఠశాలకు సమీపంలో బెల్ట్ షాపులు నిర్వహించడం ఏంటని ప్రశ్నించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తా..



శ్రీనివాసరావును సన్మానిస్తున్న సొసైటీ బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ డ్రైవర్ల సంఘానికి ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం నగరంలో నిర్వహించిన తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల మ్యూచువల్ ఎయిడెడ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ సర్వసభ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇళ్ల స్థలాలు రాకకై సీఎంతో మాట్లాడేందుకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ సలీం మాట్లాడాక.. ప్రతీ మహాజన సభలో ముగ్గురు డైరెక్టర్లను తొలగించి చైర్మన్, డైరెక్టర్ల ఆధ్వర్యాన కొత్తగా మరో ముగ్గురు డైరెక్టర్లను ఎన్నుకున్నారు. అనంతరం ఏలూరి శ్రీనివాసరావును హౌస్ బిల్డింగ్ సొసైటీ బాధ్యులు సన్మానించారు. ఎండీ సలీం అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ముఖ్య సలహాదారుడు కె.కోటేశ్వరరావు, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వీజీకే మూర్తి, గౌరవ అధ్యక్షుడు ఎండీ అబ్దుల్ హకీమ్, వైస్ చైర్మన్ దాసరి వేణుగోపాల్, జి.రాములు, బి.రామారావు, వనమా శ్రీనివాసరావు, బానోత్ హరిసింగ్, మామిడి బాబూరావు, ఆదినారాయణ, గంగన్న, పి.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు



కబడ్డీ పోటీల్లో పాల్గొన్న మహిళా ఉద్యోగులు

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ నాలుగో తరగతి మహిళా ఉద్యోగులకు ఆదివారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను తెలంగాణ గెజిటెడ్ సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడారు. ఈ పోటీల్లో మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పోటీల్లో పురుషులతో సమానంగా రాణించి క్రీడా స్ఫూర్తి చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఓ రాష్ట్ర కార్యదర్శి కొండూరు గంగాధర్, కస్తాల సత్యనారాయణ, వేలాద్రి, నాలుగో తరగతి రాష్ట్ర సంఘం అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్, మహిళా సంఘం ప్రతినిధులు పి.అంజమ్మ, కె.కృష్ణవేణి, సావిత్రి, కోడి లింగయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, సాయంత్రం వేళ మహిళలకు కబడ్డీ, టెన్నికాయిట్, టాగ్ ఆఫ్ వార్, పరుగు పందెం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

దాడి ఘటనపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: భార్యపై దాడికి పాల్పడిన భర్తతో పాటు అతడి కుటుంబీకులపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక అదనపు ఎస్సై శివరామకృష్ణ కథనం ప్రకారం.. మండలంలోని ఖమ్మంపాడు గ్రామానికి చెందిన గొంది లక్ష్మడు, రమాదేవికి సుమారు ఇరవై ఏళ్ల క్రితం వివాహం అయింది. వీరికి ఇద్దరు సంతానం కాగా గత కొంతకాలంగా వారిద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యాన ఈ నెల 1వ తేదీన రమాదేవిపై భర్తతో పాటు అతడి కుటుంబీకులు కలిసి దాడికి పాల్పడ్డారు. దీంతో బాధితురాలు భర్తతో పాటు మరో ఐదుగురిపై ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాలిక అదృశ్యంపై..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణానికి చెందిన ఓ బాలిక అదృశ్యంపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. టౌన్ ఎస్సై పీ.వీ.ఎన్.రావు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని భగవాన్‌దాస్ కాలనీకి చెందిన ఓ బాలిక ఆదివారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసిన ఫలితం లభించలేదు. దీంతో ఆదివారం రాత్రి బాలిక తండ్రి శివకుమార్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పీ.వీ.ఎన్.రావు తెలిపారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

దమ్మపేట: కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడి చేసిన సంఘటన ఆదివారం మండల పరిధిలోని పాత చీపురుగూడెం గ్రామ శివారు చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామ శివారులో కోడి పందేలు ఆడుతున్నారనే సమాచారం మేరకు ఎస్సై సాయికిశోర్‌రెడ్డి సిబ్బందితో కలిసి స్థావరంపై దాడి చేశారు. దీంతో నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రెండు కోడి పుంజులు, రెండు బైకులు, మూడు మొబైల్ ఫోన్లతో పాటు రూ.2,010ల నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు.

బీజేపీతోనే బీసీల అభివృద్ధి సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్ గౌడ్

చుంచుపల్లి: అణగారిన బీసీ వర్గాల అభివృద్ధి కేవలం కేవలం బీజేపీతోనే సాధ్యమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ అన్నారు. ఆదివారం కొత్తగూడెం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన ఓబీసీ సామాజిక సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా తెలంగాణలో లక్షల కుటుంబాలు ఆర్థికంగా బలపడే అవకాశం కలిగిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించడం, కేబినెట్‌లో 27మంది బీసీలకు మంత్రులుగా అవకాశం కల్పించడం, బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో అధిక ప్రాధాన్యతనిస్తూ బీసీల అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు కే.వీ.రంగాకిరణ్ మాట్లాడుతూ.. జిల్లాలో విశ్వకర్మ యోజన పథకానికి అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అంతేకాక రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో బీసీలందరూ బీజేపీకి ఓటు వేసేలా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర కోశాధికారి ఆకారం రమేశ్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు బిట్రగుంట క్రాంతికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలంచెర్వు శ్రీనివాసరావు, అధికార ప్రతినిధి పోనిశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు సాయిరాం, లక్ష్మణచారి, కేశగాని శ్రీనివాస్‌గౌడ్, గొడుగు శ్రీధర్, రపాక రమేశ్, గంధం నాగేంద్ర ప్రసాద్, వెలిశెట్టి రామారావు, భోగి చందర్ రావు,మీసాల దుర్గారావు, మాధవ్,రేవెళ్ల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ ఎంపీ స్థానాన్ని ఆదివాసీలకే ఇవ్వాలి

ఆదివాసీ అఖిలపక్షం, ప్రజా సంఘాల జేఏసీ తీర్మానం

భద్రాచలంటౌన్: ఆదివాసీలు అధికంగా ఉన్న మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకర్గం నుంచి రాబోయే ఎన్నికల్లో ప్రధాన పార్టీలు ఆదివాసీలకే టికెట్ కేటాయించాలని ఆదివాసీ అఖిలపక్షం ప్రజా సంఘాల జేఏసీ జాతీయ కన్వీనర్ చంద లింగయ్యదొర అన్నారు. ఆదివారం భద్రాచలం పట్టణంలో ఆదివాసీ అఖిలపక్షం ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యాన జరిగిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహబూబాబాద్ పార్లమెంట్‌లో ఉన్న 12.50లక్షల మంది జనాభాలో 3.75 లక్షల మంది ఆదివాసీలు ఉండగా, 2.50లక్షల మంది లంబాడాలు ఉన్నారని తెలిపారు. మెజార్టీ ఉన్న ఆదివాసీలను ప్రధాన రాజకీయ పార్టీలు విస్మరించి లంబాడాల కార్పొరేట్ శక్తులకే పెద్దపీట వేస్తున్నాయని ఆరోపించారు. ఒకవేళ ఆదివాసీలకు టికెట్ కేటాయించలేనిపక్షంలో ఒంటరిగా పోటీ చేస్తామని హెచ్చరించారు. గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాడుగు శ్రీనాథ్, వట్టం నారాయణ, రామకృష్ణ, శ్రీరామమూర్తి, లక్ష్మ య్య, శ్రీను, నరసింహారావు, లక్ష్మయ్య, శ్రీను, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మవిశ్వాసం

సినీనటుడు సుమన్



మాట్లాడుతున్న సినీనటుడు సుమన్

ఖమ్మం స్పోర్ట్స్ : మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, భవిష్యత్‌లో రాబోయే పరిణామాలను ఎదుర్కొనే అవకాశం ఉంటుందని సినీనటుడు సుమన్ అన్నారు. ఖమ్మం నగరంలోని వర్తక సంఘం భవనంలో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సుమన్ మాట్లాడుతూ.. ప్రధానంగా మహిళాలు కరాటేలో ప్రావీణ్యం సంపాదించాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని కరాటే విద్యార్థులు మరింత అభివృద్ధి సాధించేలా మార్షల్ ఆర్ట్స్ కృషి చేయాలని సూచించారు. ఒక రోజుకు పరిమితంగా నిర్వహించిన ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ ఆత్మహత్య

కట్టంగూర్: నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల గ్రామ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్(బీపీఎం) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై ఎస్.శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం పట్టణానికి చెందిన దేవరపల్లి యమున (30) ఆరు నెలల క్రితం అయిటిపాముల బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్‌గా విధుల్లో చేరింది. అయిటిపాములలోనే అద్దె ఇంట్లో ఉంటున్న యమున ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తలుపులు తీయకుండా ఉండడంతో చుట్టుపక్కల వారు గమనించి నల్లగొండలో ఉంటున్న ఆమె బంధువులకు సమాచారం ఇచ్చారు. నల్లగొండ నుంచి వచ్చిన బంధువులు తలుపులు తీసి చూసేసరికి యమున చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించింది. యమున మృతిపై అనుమానం ఉందని ఆమె అన్న దేవరపల్లి దుర్గాప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'మాస్‌లైన్' తడాఖా..

పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు మూడు విప్లవ పార్టీలు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ యూనిటీగా ఆదివారం అవతరించింది. తొలుత నగరంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, పీసీసీ సీపీఐ(ఎంఎల్), సీపీఐ(ఎంఎల్) ఆర్ఐ పార్టీల జాతీయ, రాష్ట్ర నాయకులు భారీ ప్రదర్శన తీశారు. అనంతరం జరిగిన మహాసభలో పలువురు నేతలు మాట్లాడుతూ.. చారిత్రక తప్పిదాలను సవరించుకునేందుకే విప్లవ పార్టీలు విలీనమైనట్లు పేర్కొన్నారు. ఈనేపథ్యాన కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు అందరిలో జోష్ నింపి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం



ర్యాలీ తీస్తున్న జాతీయ, రాష్ట్ర నాయకులు



ర్యాలీలో కళాకారుల నృత్యం



కొమ్ము డప్పు నృత్యం



సభ వేదికపై పాటలు పాడుతున్న అరుణోదయ కళాకారులు



ఎర్రజెండాతో చిన్నారి



సభా కార్యక్రమాలను సెల్‌ఫోన్‌లో బంధిస్తున్న మహిళా కార్యకర్త